www.vaarthavedhikasurya.com
RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక


VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | శనివారం 17, జనవరి 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 235 | పేజీలు: 08 | వెల: 5/-



## జైపాల్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):** దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. నెక్లెస్ రోడ్ లోని జైపాల్ సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి, దేశానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి చిన్నారెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.




# ప్రభుత్వానికి వారధులు, సారధులు
# ప్రభుత్వ ఉద్యోగులే

- గరం, నరం, బే షరమ్ నానుడి తప్పు అని ఉద్యోగులు నిరూపించాలి
- తల్లిదండ్రులను సరిగా చూసుకోని వాళ్లు మానవ జన్మలో ఉండొద్దు
- రాజకీయ పార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు
- ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసు
- శిల్పా కళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి
- గ్రూప్ 3 విజేతలకు నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):**

పుట్టిన బిడ్డ ప్రయోజకుడు అయితే తల్లిదండ్రుల ఆనందం అంతా ఇంతా కాదు.. కూలీ పని చేసి మరీ తల్లిదండ్రులు చదవించి పోటీ పరీక్షలకు తయారు చేశారు.. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లో విద్యార్థులు ఉద్యమకారులయ్యారు. విద్యార్థులు అవసరమైన సందర్భంలో ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించారు..

10 ఏళ్లలో రెండు సార్లు సీఎం అయిన వ్యక్తులు రాజకీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల కోసమే



పనిచేశారు .ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పైన ఆలోచన చేయలేదు. కుటుంబం మొదటి ప్రాధాన్యత, పార్టీ రెండో ప్రాధాన్యత, రాజకీయాలు మూడో ప్రాధాన్యతగా గత పాలకులు ఆలోచించారు. తెలంగాణ యువత గురించి ఆలోచించలేదు.

వాళ్ల ఉద్యోగాలు తొలగిస్తేనే మాకు ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నడుం బిగించారు కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. టీజీపీఎస్సీ లో దారుణ పరిస్థితులు అందరికి తెలుసు. 14 యేళ్ల పాటు గ్రూప్ వన్ నియామకాలు చేపట్టలేకపోయారు.. ఇంత కంటే దారుణం, ఘోరం ఎక్కడైనా ఉంటుందా?

563 గ్రూప్ వన్ ఉద్యోగాల కోసం 5 లక్షల మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు. 731 గ్రూప్ 2 ఉద్యోగాల కోసం కూడా 5 లక్షల మంది అప్లై చేశారు. గత ప్రభుత్వం పరీక్షలను సరిగా నిర్వహించలేదు. ప్రశ్నా పత్రాలను పల్లీ బఠానీల్లా అమ్మితే వారికి చీమకుట్టినట్లైనా లేదు

టీజీపీఎస్సీ ని సమూలంగా ప్రక్షాళన చేశాం.. యూపీఎస్సీ ని స్వయంగా పరిశీలించి టీజీపీఎస్సీ ని ఏర్పాటు చేశాం. ఆర్ ఎంపీ డాక్టర్, డిప్యూటీ ఎమ్మార్వో, రిటైర్డ్ టీచర్ నుటీజీపీఎస్సీ సభ్యులు గా గత ప్రభుత్వం నియమించింది. తెలంగాణ నిరుద్యోగుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉన్నవాళ్లేనే టీజీపీఎస్సీ సభ్యులు గా నియమించాం.

ప్రభుత్వ టీచర్లు, గ్రూప్ 1,2,3 వంటి ఉద్యోగాలను ఒక బాధ్యతతో ఎలాంటి తప్పులు లేకుండా భర్తీ చేశాం. నియామకపత్రాలు ఇవ్వొద్దని కుట్రలు చేసినా కోర్టుల ముందు కొట్లాడి భర్తీ చేశాం. రెండేళ్లలో దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశాం. ఎల్బీ స్టేడియం, శిల్పారామం, సాగునీటి పారుదల శాఖ కార్యాలయం, అంబేద్కర్ విగ్రహం సాక్షి గా నియామక పత్రాలను అందజేశాం.

భవిష్యత్తు తరాలకు మీ ఉద్యోగాలు దిక్సూచి గా మారుతుంది.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక భావోద్వేగం.

మిగతా 2లో..

# సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు భారీ ఏర్పాట్లు

- తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు
- క్షేత్ర స్థాయిలోనే ఉండి, ప్రతి విభాగం పనితీరును సమీక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్న మంత్రి సీతక్క



**మేడారం,జనవరి16(వార్త వేదిక సూర్య):** మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నిటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి మంత్రి సీతక్క మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు.

భక్తుల సౌకర్యం, సుభిక్ష దర్శనం ఆమె ప్రథమ ప్రాధాన్యతగా మారింది. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా మంత్రి సీతక్క నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది మేడారం, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా2 వేల మంది ఆదివాసీ యువత వాలం టీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మొబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్లతో పాటు తాత్కాలిక పద్దతిలో 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు.

భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి భాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు.తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు.

# సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు
- అనర్హత ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన
- కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత

**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్‌పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.



ఖైరతాబాద్ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందుపరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపో వడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటిషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తు న్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అను కూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నా రని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

- రూ.362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ
- మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజక వర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

**- పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ**

మద్దులపల్లిలో జేఎన్టీయూకళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి



శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

**తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ**

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు.

# పాతబస్తీ నుంచి హిందువులను తరిమేసే కుట్ర

- రేవంత్ ప్రకటనలతో మరింత ప్రమాదం
- ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం హిందూ సమాజాన్ని బలిచేస్తున్నారు
- కేసీఆర్ అయినా, రేవంత్ అయినా విధానం ఒకటే
- బీఆర్ఎస్ పాలనలో కూడా ఇదే ధోరణి
- నిజామాబాద్ పేరు "ఇందూరు"గా మార్చడం మా అజెండా
- నిజాం పేరు పెట్టుకోవడం హిందువులకు అవమానం.
- ఆవాస్ యోజనలో కోట్లాది ముస్లింలకు ఇళ్లు ఇచ్చాం.
- ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భద్రత కల్పించాం
- హిందూ సమాజంపై దాడులను సహించం.
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో హిందూ దేవాలయాలపై దాడులు పెరిగాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. Congress is Muslim, Muslim is Congress అనే మాట అత్యంత ప్రమాదకరమైన స్టేట్మెంట్. ఈ మాటలతో హిందువులలో కావాలనే భయం సృష్టిస్తున్నారు. ఆ భయమే రేపు కమ్యూనల్ వైలెన్స్‌కు ట్రిగ్గర్ అవుతుంది..

కాంగ్రెస్-ఎంఐఎం కలిసి హిందూ సమాజాన్ని టార్గెట్ చేస్తున్నాయి. ముఖ్యంగా పాతబస్తీ ప్రాంతంలో దేవాలయాలపై దాడులు పెరిగాయి. ఇది కాశ్మీర్‌లో 80-90లలో జరిగిన ఎక్సోడస్ తరహా పరిస్థితులకు దారితీసే కుట్ర. ఓల్డ్ సిటీ నుంచి హిందువులను తరిమేయాలన్న దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.

పోలీస్ వ్యవస్థ న్యూట్రల్‌గా కాకుండా రాజకీయ ఒత్తిడిలో పని చేస్తోంది. దాడులు జరిగినా హిందువులనే అరెస్ట్ చేస్తున్న సమాచారం వస్తోంది. ఇది పూర్తిగా అన్యాయం.. 1980-90లలో కూడా హైదరాబాద్ తీవ్రమైన కమ్యూనల్ టెన్షన్ చూసింది. అప్పట్లో కాంగ్రెస్ పాలనలోనే ఘోరమైన అల్లర్లు జరిగాయి..

మిగతా 2లో..

# రేవంత్.. ఏ మొహం పెట్టుకొని ఇప్పుడు మళ్ళీ రీ-రన్ డ్రామాలు ఆడుతున్నావు?

- వంట వండి వడ్డనకు సిద్ధం చేస్తే.. గంటె పట్టుకొని ఫోటోలకు పోజులివ్వడం రేవంత్ రెడ్డికే చెల్లింది
- రిబ్బన్ కట్ చేస్తూ అంతా మీ ఘనతే అని డబ్బా కొట్టుకోవడం మీ దగుల్బాజీతనానికి పరాకాష్ట
- సి.రామచంద్రారెడ్డి పేరు ప్రాజెక్టుకు పెట్టడం అంటే ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను అవమానించడమే
- సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్,జనవరి16(వార్త వేదిక సూర్య):** కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు.. సీఎం పదవి కలిసొచ్చిన రేవంత్ రెడ్డికి కేసీఆర్‌నిర్మించిన ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకపత్రాలు రెడీ మేడ్ గా తయారై ఉన్నాయి. క్రెడిట్ కొట్టేయడం మీద ఉన్న శ్రద్ధ.. పాలన మీద, ప్రాజెక్టుల మీద పెడితే ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది.

తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చేందుకు కేసీఆర్‌అహర్నిశలు శ్రమించి ప్రాజెక్టులు కడితే, వాటిపై కాంగ్రెస్ స్టిక్కర్లు వేసుకోవాలని చూస్తున్న రేవంత్ అర్భకత్వాన్ని చూసి జాలి వేస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నిర్మించిందేం లేక కేసీఆర్ గారు పూర్తి చేసిన ప్రాజెక్టులు, నిర్మాణాలకు రిబ్బన్ కట్ చేయడమే పనిగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి.

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు.. సీఎం పదవి కలిసొచ్చిన రేవంత్ రెడ్డికి కేసీఆర్‌నిర్మించిన ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకపత్రాలు రెడీ మేడ్ గా తయారై ఉన్నాయి. తట్టెడు మట్టి తీసింది లేదు, ఒక్క ఇటుక వేసింది లేదు అయినా చనాకా కొరటా, సదర్మాట్ బ్యారేజీలను తామే పూర్తి చేసినట్లు గొప్పలు చెప్పుకున్న నేటి మీ సభ మీరు చెప్పినట్లే.. చరిత్రలో నిలబడుతుంది ఉత్తం గారూ.

కేసీఆర్‌మహారాష్ట్రతో చారిత్రక

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY










## ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవ ఉత్సవాలు

**చౌటుప్పల్, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చౌటుప్పల నగరం సౌజన్యంతో స్థానిక గాంధీ పార్క్ లో శుక్రవారం సంక్రాంతి ఉత్సవం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమమునకు సూర్యాపేట మండల అభివృద్ధి అధికారి గోశిక బాలకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ముఖ్యవక్తగా భువనగిరి జిల్లా కార్యవాహ కంబాలపల్లి కృష్ణయ్య విచ్చేసి ప్రసంగిస్తూ భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరివాప్తికై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఉత్సవమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రీయ సెక్షన్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ మాసంలో జన జాగరణ కొరకు కుటుంబ సంపర్క కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్చి మాసంలో హిందూ మహాసమ్మేళనం నిర్వహించడం జరుగునని తెలిపారు.

ఈ జన జాగరణ కార్యక్రమంలో పంచ పరివర్తన ద్వారా కుటుంబాలలో వికాసం కలిగించడానికి దేశభక్తిని పెంపొందింప చేయడానికి కృషి చేయడం జరుగుతున్నదని అదేవిధంగా వ్యక్తి నిర్మాణం ద్వారా సౌశీల్యము నేటి యువత లో కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల జాగరణ ప్రముఖ్ బడుగు శ్రీరాములు , చౌటుప్పల కార్యవాహులు పోలోజు శ్రీనివాసాచారి, మలిగ ఉదయ్, గంజి వెంకటేశ్వర్లు, బడుగు బిక్షపతి , ఎం కరుణాకర్ రెడ్డి, వేణు కుమార్, గోషిక నరసింహ, బడుగు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాలిపటములు ఎగరవేసి ఉత్సవం నిర్వహించారు.

### ప్రభుత్వానికి వారధులు, సారధులు

## ప్రభుత్వ ఉద్యోగులే

మొదటి పేజీ తరువాయి..

తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో మీమ్మల్ని భాగస్వాములు చేస్తోంది. 25 ప్రభుత్వ శాఖల్లో 1370 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. ఉద్యోగ నియామకాలతోకలిసి మీ కళ్లలో ఆనందం చూడాలనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం.

మాజీ ప్రధాని నెహ్రు విద్య, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలో హరిత విప్లవాన్ని తీసుకువచ్చి అహార భద్రత కల్పించింది మాజీ ప్రధాని నెహ్రు. విద్య అందరికి అందుబాటులో ఉన్నప్పటికి నాణ్యమైన విద్య ప్రజలకు అందడం లేదు. 16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్నారు. 11 వేల ప్రైవేట్ స్కూల్స్ లో33 లక్షల విద్యార్థులు చదువుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలపైన ఎందుకు విశ్వాసం తగ్గుతుందో ఆలోచించాలి. పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తే ప్రపంచంతో పోటీ పడగలమనే విశ్వానం నాకుంది. భారతదేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రం గా తెలంగాణ నిలబడింది. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరిని పండించి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం..

క్వాలిటీ ఎడ్యుకేషన్, క్వాలిటీ ఫుడ్, స్కిల్ పైన దృష్టి పెడుతున్నాం. స్కిల్ లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడలేకపోతున్నాం.. విద్యలో స్కిల్ చాలా ముఖ్యమైనది. స్కిల్ డెవలప్మెంట్ కోసం పనిచేయాల్సి ఉంది. నాణ్యమైన విద్యను అందించే అవకాశం ప్రభుత్వం దగ్గర ఉంది. విద్య ఒక్కటే జీవితాల్లో మార్పు, వెలుగులు తీసుకువస్తుంది.

ప్రభుత్వానికి వారధులు, సారధులు ప్రభుత్వ ఉద్యోగులే. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా తెలంగాణ ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గరం,నరం, బే షరమ్ నానుడి తప్పు అని ఉద్యోగులు నిరూపించాలి.

పేదల మోహంలో తల్లిదండ్రులను చూసుకునిప్రభుత్వ ఉద్యోగులు సేవలు లక్ష్యంగా అందించాలి. తల్లిదండ్రులను గౌరవం గా చూసుకొని ఉద్యోగుల జీతంలో 10 నుంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రులకు అందజేస్తాం. తల్లిదండ్రులను సరిగా చూసుకోని వాళ్లు మానవ జన్మలో ఉండొద్దు.తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి. రాజకీయ పార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసు.

## పాతబస్తీ నుంచి హిందువులను తరిమేసే కుట్ర

మొదటి పేజీ తరువాయి..

చెన్నారెడ్డి రాజీనామా చేసిన తర్వాతే అల్లర్లు ఆగాయి, ఇది చరిత్ర. అప్పట్లో ఎంఐఎం ఎమ్మెల్యేలు నేరుగా అల్లర్లలో పాల్గొన్నారు. ఏఎస్పీ సత్తయ్యచర్యలు తీసుకున్నందుకే హత్య చేయబడ్డారు. దోషులను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడింది. ఇదే కాంగ్రెస్–ఎంఐఎం చరిత్ర.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జరిగిన దేవాలయాలపై దాడుల లిస్ట్...!!

ఆగస్టు 26, 2024 – భూలక్ష్మీ మాత ఆలయం, సంతోష్ నగర్.
అక్టోబర్ 14, 2024 – ముత్యాలమ్మ ఆలయం.
నవంబర్ 5, 2024 – హనుమాన్ ఆలయం, శంషాబాద్.
నవంబర్ 9, 2024 – సోమయ్య చౌడమ్మ, పోచమ్మ ఆలయాలు.
మార్చి 10, 2025 – రామలింగేశ్వర, ఆంజనేయ ఆలయం, గాంధీనగర్.
అక్టోబర్ 16, 2025 – రామాలయం, రాంపల్లి.
జనవరి 6, 2026 – వెంకటేశ్వర స్వామి ఆలయం, కేపిహెచ్‌బీ.
జనవరి 10, 2026 – కట్టమైసమ్మ ఆలయం, సఫిల్గూడ.
జనవరి 14, 2026 – మైసమ్మ ఆలయం, పురాణపుల్.

ఇవి కేవలం రిపోర్ట్ అయిన ఘటనలే. ఇంకా రిపోర్ట్ కాని ఘటనలు చాలా ఉన్నాయి. ఈ దాడులన్నింటికీ నైతిక బాధ్యత ముఖ్యమంత్రిదే. ఎన్నికల్లో కాంగ్రెస్ హిందూ దేవతలపై ఒట్లు వేసి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం హిందూ సమాజాన్ని బలి చేస్తున్నారు.

కేసీఆర్ అయినా, రేవంత్ అయినా విధానం ఒకటే.. బీఆర్ఎస్ పాలనలో కూడా ఇదే ధోరణి చూశాం.. నిజామాబాద్ పేరు "ఇందూరు"గా మార్చడం మా అజెండా. ఇది రాజకీయ నిర్ణయం కాదు– చారిత్రక న్యాయం. 1909 ఇంపీరియల్ గెజిటియర్‌లో ఇందూరు అనే పేరు స్పష్టంగా ఉంది.బ్రిటిష్ కాలం రైల్వే మ్యాప్స్‌లో కూడా ఇందూరు ఉంది. తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్ కూడా ఇదే చెబుతోంది. ఇందూరు పేరు రాజు ఇంద్రదత్త నుంచి వచ్చింది. నిజాం పేరు పెట్టుకోవడం హిందువులకు అవమానం. నిజాం పాలనలో హిందువులపై ఘోరమైన అఘాయిత్యాలు జరిగాయి. మహిళలపై అత్యాచారాలు, పిల్లల హత్యలు జరిగాయి. నిజాం ఒక క్రూర పాలకుడిగా మాత్రమే చరిత్రలో మిగిలాడు. ఇందూరు మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ గెలుస్తుంది. మొదటి రిజల్యూషన్ పేరు మార్పుపైనే ఉంటుంది. ఆ రిజల్యూషన్‌ను సీఎం రేవంత్ రెడ్డికి పంపిస్తాం. కాంగ్రెస్ నేతలు మతకోణం లేకుండా రాజకీయాలు చేయలేరు. రాముడికి బీజేపీ మెంబర్‌షిప్ ఉందా" అన్నవ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాశీ. ముందు కాంగ్రెస్ పార్టీ స్టేట్మెంట్లకు సమాధానం చెప్పండి. మోదీ ప్రభుత్వం ముస్లింలకు కూడా సమానంగా సంక్షేమం అందించింది. ఆవాస్ యోజనలో కోట్లాది ముస్లింలకు ఇళ్లు ఇచ్చాం. ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భద్రత కల్పించాం. కోవిడ్ సమయంలో ఉచిత వ్యాక్సినేషన్ ఇచ్చాం. 100 దేశాలకు వ్యాక్సిన్లు పంపాం. అభివృద్ధిలో మత భేదం లేదు –ఇది బీజేపీ విధానం.కాంగ్రెస్, ఎంఐఎం ఇప్పటికీ నిజాం వారసత్వాన్ని పొగుడుతు న్నాయి. ఇది హిందూ సమాజాన్ని అవమానించడమే. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ముఖ్యమంత్రి మానసిక సమతుల్యతపై సందేహం ఉంది. దేవాలయాకేటీఆర్కుల ధ్వంసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. విగ్రహాల విధ్వంసం నిరంతరం కొనసాగుతోంది. మీడియా బాధ్యతగా వ్యవహరించాలి. ఆధారాలు లేకుండా కథనాలు రాయకూడదు. ఫిర్యాదు ఉంటే పోలీసులు చర్యలు తీసుకోవాలి.

### లేబర్ కోడ్స్ ,వి బి జి రామ్ జీ, విద్యుత్ సవరణ చట్టాన్ని

# రద్దు చేసేవరకు పోరాటం ఆగదు..

**19న నల్లగొండ బహిరంగ సభను జయప్రదం చేయండి.**

**రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం**

**చండూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గ హక్కుల్ని కాలరాస్తూ,ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం పేరుతో రైతులను ప్రజలను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం పై సమరశీల ఐక్య ఉద్యమాలకు కార్మిక వర్గం, రైతాంగం సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

శుక్రవారం చండూరు మండల కేంద్రంలో రైతు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల జీపు జాతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా జనవరి నెల మొత్తం పెద్ద ప్రచార క్యాంపెయిన్ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు చేస్తామని అన్నారు. మోడీ విధానాలు మార్చుకోకపోతే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.



బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులు మరింత దోపిడీ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రామ్ జీ గా మార్చి పేదల పొట్ట కొట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ సవరణ చట్టం 2025 ప్రకారం భవిష్యత్తులో విద్యుత్ రంగం ప్రైవేటుపరమై సబ్సిడీలు పోతాయని ప్రజలపై రైతులపై మరింత భారం పెరగ నుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ,దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పనంగా అప్పజెప్తోందని అన్నారు. ఈ విధానాలపై కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల వ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త ప్రచార కంపియన్ జయప్రదం చేయాలని కోరుతూ గ్రామస్థాయి వరకు ప్రచార జాతలు జనవరి 19న సభతో ప్రభుత్వానికి ఒకహెచ్చరిక చేస్తామని అన్నారు ఈనెల 19న జరిగే నల్గొండలో జరిగే సభకు అధిక సంఖ్యల కార్మికుల కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు

ఈ కార్యక్రమంలో సిఐటియు చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయ, సిఐటియు సీనియర్ నాయకులు మోగుదాల వెంకటేశం,చిట్టి మల్ల లింగయ్య, హమాలి యూనియన్ నాయకులు సాయం కృష్ణయ్య, బత్తుల యాదయ్య, కొంక బిక్షం, నలపరాజు నరసింహ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బీ పంగి నాగరాజు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీ

# ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి

**పాలడుగు భాస్కర్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి**

**చౌటుప్పల్, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** లేబర్ కోడ్స్ బిబి రామ్ జి చట్టం, జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లుల రద్దుకై జరిగే దేశవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కండి, కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి. అని పాలడుగు భాస్కర్ అన్నారు. సోమవారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీ లో ఎండి పాషా, అధ్యక్షతన యాదాద్రి భువనగిరి జిల్లా సిఐటియు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘం, ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త జీపు జాతను ప్రారంభించి మాట్లాడుతు గత 11 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే గాక రాష్ట్రాల హక్కులను అరిస్తూ చట్టాలను చేసింది అని అన్నారు. ఒకవైపున ప్రజా సంక్షేమం వల్లిస్తూనే, 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ, వంటి బడ పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని విమర్శించారు. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయడం. విద్యుత్తు సవరణ చట్టం విత్తన బిల్లు విబి జి రామ్ జి, చట్టం భీమా రంగంలోకి 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి అనురంగంలోకి ప్రవేట్ కంపెనీలకు అనుమతిస్తూ అనుచట్టం, చేసిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా సిఐటియు తెలంగాణ రైతు సంఘం ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈరోజు చౌటుప్పల్ నుండి జిల్లా వ్యాప్త జీపును ప్రారంభించడం జరిగిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నరసింహ మాట్లాడుతూ. వికసిద్భారత్ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు .2005 లో వామపక్ష ల పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం రూపొందించి చట్టం





ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో వందరోజుల పని కల్పించాలి ప్రస్తుతం రోజుకు 307 రూపాయలు ఇవ్వాలి దేశంలో మొత్తం వేయంలో 90% కేంద్రం 10 శాతం రాష్ట్రాలు భరించాలి ఈ చట్టం ద్వారా కరువుల్లో, కరోనా, సందర్భంగా గ్రామీణ ప్రజల కు ఉపాధి దొరికిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చి ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేస్తుందని మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిద్భారత్ జి రామ్ జి పేరుగా మార్పు చేయడమే కాక రాష్ట్రాలు 40 శాతం కేంద్రం 60 శాతం భరించాలని నిర్ణయించింది. దీనివల్ల ప్రస్తుతం 10 శాతాన్ని రాష్ట్రాలు భరించలేకపోతున్నాయని. ఈ 40 శాతం విధించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని నీరుగారిచే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ లుగా సంక్షిప్తీకరించి లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని అన్నారు. వేతనాల కోడ్ 2019 సామాజిక భద్రత కోడ్ 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ వృత్తి రక్షణ ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్ ఈ నాలుగు కోడ్ లను ప్రభుత్వం తీసుకురావడం వల్ల కార్మికులకు అసంఘటిత కార్మికులకు చాలా ప్రమాదం ఉందని అన్నారు. ఈ కోడ్ లను పార్లమెంటులో ఉపసంహరించే వరకు సమైక్య ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు .రైతు సంఘం రాష్ట్ర నాయకులు మా టూరు బాలరాజు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల జాతీయ విత్తన బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనలు కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలు ప్రజాస్వామిక వాదులు భాగస్వాములు కావాలని జనవరి 19న జరిగే కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభకు పాల్గొనాలని కోరారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గోశిక కరుణాకర్, జీపు జాత నాయకులు చంద్రారెడ్డి, ముత్యాలు, రాగిరి కిష్టయ్య, ఆదిమూలనందీశ్వర్, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, ఆకుల ధర్మయ్య, పరిమి ధర్మారెడ్డి, బండారు నరసింహ, తూర్పునూరు మల్లేశం ,కొండే శ్రీశైలం, తడకమ్మోహన్, ఉస్కాపుల శ్రీనివాస్, కలకుంట్ల శివ, చీమకండ్ల శ్రీరాములు, నెలికంటి నరసింహ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## రైతులు నూతన వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవాలి

**సుద్దాల 9వ వార్డు నెంబర్ ఎగమాటి వేణు గోపాల్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** ప్రతి రైతు డ్రోన్‌ను ఉపయోగించుకోండి తక్కువ శ్రమతో అధిక దిగుబడి సాధించండి రైతు బిడ్డ ఎగమాటి వేణుగోపాల్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా సుద్దాల గ్రామానికి చెందిన రైతులు నూతన వ్యవసాయ సాంకేతిక విధానాలను విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా జై గౌడ్ నాయకులు బత్తిని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంప్రదాయ వ్యవసాయానికి తోడు నూతన సాంకేతికతను అనుసరించడం



ద్వారా రైతులు శ్రమను, సమయాన్ని గణనీయంగా ఆదా చేసుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా బ్యాటరీ ద్వారా పనిచేసే డ్రోన్ సాంకేతికత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు.

సాధారణంగా ఒక రైతు 24 గంటల్లో చేసే పనిని డ్రోన్ సహాయంతో కేవలం ఐదు నుంచి ఆరు గంటల్లోనే పూర్తి చేయవచ్చని వివరించారు. డ్రోన్‌ల ద్వారా పంటలపై మందుల పిచికారీ, ఎరువుల చల్లడం వంటి పనులు వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.

దీంతో మానవ శ్రమ తగ్గడమే కాకుండా, పంటలకు సమానంగా మందులు పడతాయని ఆయన చెప్పారు.నూతన వ్యవసాయ సాంకేతిక విధానాల అమలుతో ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగి, రైతుల ఆదాయం మెరుగుపడుతుందని బత్తిని మహేష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. ప్రతి రైతు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంపొందించుకొని వాటిని ఆచరణలో పెట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## రేవంత్.. ఏ మొహం పెట్టుకొని ఇప్పుడు మళ్ళీ రీ-రన్ డ్రామాలు ఆడుతున్నావు?

మొదటి పేజీ తరువాయి..

ఒప్పందం కుదుర్చుకొని, రూ. 1200 కోట్లు ఖర్చు పెట్టి చనాకా–కొరాటా బ్యారేజీ, పంప్ హౌస్‌లు, మెయిన్ కెనాల్, సబ్ స్టేషన్లతో సహా పనులు పూర్తి చేయించారు. 2023 సెప్టెంబర్‌లోనే సక్సెస్‌ఫుల్‌గా వెట్ రన్ కూడా పూర్తి చేసారు.

ప్రాజెక్టుకు కాలువల పనులకు అవసరమైన 3,200 ఎకరాల్లో 1600 ఎకరాలను కేసీఆర్ గారు సేకరిస్తే.. ఈ రెండేళ్లలో ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేని నువ్వు, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వని నువ్వు.. ఏ మొహం పెట్టుకొని ఇప్పుడు మళ్ళీ రీ–రన్ (వెట్ రన్) డ్రామాలు ఆడుతున్నావు? రెండేళ్లుగా భూమి సేకరించకుండా, కాలువలు తవ్వకుండా.. ఆదిలాబాద్ ప్రజలను మోస పుచ్చారు. క్రెడిట్ కొట్టేయడం మీద ఉన్న శ్రద్ధ.. భూసేకరణ మీద పెట్టి ఉంటే ఈపాటికి ప్రాజెక్ట్ ఫలితాలు రైతులకు దక్కేవి.

1.5 TMCల సామర్థ్యంతో కేసీఆర్ గారు రూ. 500 కోట్లతో సదర్మాట్ బ్యారేజీని సిద్ధం చేస్తే.. రెండేళ్లుగా చుక్క నీరు నిలపకుండా ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల నోట్లో మట్టి కొట్టారు. రెండేళ్ల క్రిందనే 18 వేల ఎకరాల ఆయకట్టును నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా, ఇవ్వకున్నా రైతులకు తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు సిగ్గులేకుండా రిబ్బన్ కట్ చేస్తూ అంతా మీ ఘనతే అని డబ్బా కొట్టుకోవడం మీ దగుల్బాజీతనానికి పరాకాష్ట. ఈ రెండేళ్ల కాలం వృథా చేసినందుకు ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు పంచడం.. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప సొంతంగా మీరు చేసిందేం లేదు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టుకు సున్నాలు వేసి నాదే అని చాటింపు వేసుకోవడం మీ అల్పబుద్ధికి నిదర్శనం. ప్రాజెక్టులు కట్టడం మా వంతు, పేర్లు పెట్టుకోవడం మీ వంతు పరిపాటిగా మారింది. లోయర్ పెన్ గంగా ప్రాజెక్టు పేరు చెప్పుకొని రెండు సార్లు ఎన్నికల్లో గెలిచి, ప్రజల్ని మోసం చేసిన సి. రామచంద్రారెడ్డిపేరు ప్రాజెక్టుకు పెట్టడం అంటే ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను అవమానించడమే. ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్ ప్రజల కలలు సాకారం చేసింది బిఆర్ఎస్ అయితే, ఆ ప్రాజెక్టు నిర్మాణంలో వీసమెత్తు కృషి చేయని వ్యక్తి పేరు పెట్టి మోసం చేస్తున్నది కాంగ్రెస్.

ఆదిలాబాద్ వెనుకబాటు తనానికి, పాలమూరు వలసలకు కారణం దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వానిది కాదా? తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడుతామని చెప్పి రెండేళ్లు గడిచినా ఒక్క తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేక పోయారు?తమ్మిడిహట్టి పేరు మీద అప్పుడు ఆరేండ్లు, ఇప్పుడు రెండేళ్లు కాలయాపన చేశారు.. మాయ మాటలు చెప్పి అదిలాబాద్ జిల్లాకు తీరని ద్రోహం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.గ్రావిటీ కాలువను వదిలి ఎత్తిపోతలకు వెళ్లామని మమ్మల్ని విమర్శించిన మీరు ఇప్పుడు తమ్మడిహట్టి నుంచి గ్రావిటి ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చి చూపండి.. లేదంటే అధికారం కోసం ప్రజలకు నోటికొచ్చినఅబద్దం చెప్పినందుకు క్షమాపణలు చెప్పమని డిమాండ్ చేస్తున్నాను.. చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు.. రెండేళ్లలో చేసిందేం లేక బిఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నడు రేవంత్ రెడ్డి.

ఎనుముల ఫ్యామిలీ అభివృద్ధి కోసం రెండేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిండు.. బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అప్పు అక్షరాల రూ.4.17లక్షల కోట్లే అని కాగ్ రిపోర్ట్‌తో పాటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పినా ఎందుకు పదే పదే తప్పుడు ప్రచారం చేస్తున్నారు? ప్రతిపక్షంలో అబద్దాలే, అధికార పక్షంలో అబద్దాలే. జీవితమంతా అబద్దాలేనా?

రేవంత్ రెడ్డి రెండేళ్లలోనే రెండున్నర లక్షల కోట్లు అప్పు చేసి, ఒక్క ఇటుక పెట్టలేదు, ఒక్క కాల్వ తీయలేదు, ఒక్క చెరువు తవ్వలేదు, ఒక్క హామి నిలబెట్టుకోలేదు, తెచ్చిన అప్పులతో ఏం చేసావో దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. నీ పాలన మీద నీకు నమ్మకం ఉంటే మా జోగు రామన్న ని, బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ఎందుకు ఉదయం నుంచి అరెస్టులు చేశారు రేవంత్ రెడ్డి? అరెస్టులు చేపిస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ, పోలీసులను అడ్డం పెట్టుకొని తిరుగుతూ ఇలా ఎన్ని రోజులు గడుపుతావు రేవంత్ రెడ్డి?

## అధిష్టానం ఆశీర్వాదంతో...

# బరిలో ఉంటా...

**◆ మున్సిపాలిటీ 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుర్కంటి బాలకృష్ణారెడ్డి**



**చౌటుప్పల్, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** అధిష్టానం ఆశీర్వాదంతో 9వ వార్డ్ బరిలో ఉంటూ ప్రజల సహకారంతో విజయం సాధిస్తానని చౌటుప్పల్ మున్సిపాలిటీ 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుర్కంటి బాల కృష్ణారెడ్డి అన్నారు.

శుక్రవారం ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. వార్డులో సిసి రోడ్లు అండర్ డ్రైనేజీ , తాగునీటి వసతి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని అన్నారు. వార్డులో మరింతగా అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సన్నబియ్యం, ఇందిర ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, సంక్షేమ పథకాలు చేపడుతుందని తెలిపారు.

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఇండ్లు రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలు గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. తొమ్మిదో వార్డు జనరల్ కేటగిరి వస్తే ఒక్కసారి అవకాశం కల్పిస్తే వార్డును అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని అన్నారు.




## వృద్ధురాలుని ఢీకొట్టిన లారీ, చికిత్స పొందుతూ మృతి

**వలిగొండ: జనవరి 16 (వార్తావేదిక సూర్య):** యాదాద్రి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోల్నే పల్లి గ్రామంలో ఎర్ర చంద్రమ్మ వయసు 70 సంవత్సరములు. తన ఇంటి ముందు కూర్చుని ఉండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం



మత్తులో లారీని వేగంగా నడుపుతూ చంద్రమ్మ కాలుపై వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జు అయి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వలిగొండ అంబులెన్స్ లో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి సీరియస్ గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నలగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారని 108 సిబ్బంది తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సమావేశం

**మోత్కూరు: జనవరి 16( వార్త వేదిక సూర్య):** రోడ్డు ప్రమాదాల నివారణకై మండలంలోని దాచారం గ్రామంలో గురువారం నాడు మోత్కూరు ఎస్. హెచ్.ఓ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణకు దాచారం గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు




సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొంపల్లి సతీష్ కుమార్, ఏఎస్ఐ శ్రీనివాస్ రావు, గ్రామస్తులు కర్నే వీరేష్ , శ్రీనివాస్ తదితరులు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు**

**మోత్కూరు; జనవరి 16 (వార్త వేదిక సూర్య):** మహిళలు విద్య ,వైద్య ఉపాది రంగాలతో పాటు క్రీడలలో కూడా రాణించాలని మోత్కూరు ఎస్.హెచ్. ఓ. సి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నాడు మన గడి బజార్ యువత సహకారం




తో నిర్వహించిన ముగ్గుల పోటీల బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కొంపల్లి సతీష్ కుమార్ , ఏఎస్ఐ శ్రీనివాస్ రావు, పోలీస్ సిబ్బంది ,మన గడి బజార్ యూత్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ధత్తప్పగూడెం గ్రామ పంచాయితీ పాలక వర్గానికి ఆత్మీయ సన్మానం

**మోత్కూరు: జనవరి 16 (వార్త వేదిక సూర్య):** ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలుపొందిన




గ్రామపంచాయతీ పాలకవర్గానికి శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బోనగిరి సతీష్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.ద

## మోత్కూరులో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నాడు తెల్లవారుజాము నుంచే మహిళలు తమ ఇళ్ళ ముందు వాకిట్లలో రంగు రంగులతో సంక్రాంతి ముగ్గులు వేశారు. అనంతరం ఒకరినొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



# జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ హేయమైన చర్య

**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు**

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** ఎన్టీవీ జర్నలిస్టులను విచారణ పేరుతో భయాందోళనకు గురిచేసి, ఏలాంటి నోటీసులు, సెర్చ్ వారెంట్ లేకుండా ఇండ్లలోకి వెళ్లి అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతినిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యంలో ఎవరినైన ప్రశ్నించే హక్కు జర్నలిస్టులకు ఉందని అలాంటి జర్నలిస్టులకు ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి కుటుంబాలను భయబ్రాంతులకు గురి చేస్తూ అర్ధరాత్రి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని. ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీ గా ప్రజాస్వామ్యం ఉంటుందని చెప్పే మాటలకు, చేసే పాలనకు పొంతన లేకుండా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. సెర్చ్ వారెంట్ లేకుండా ఎన్టీవీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి సోదాలు చేయడం సరికాదని, వార్త ప్రసారాలలో అభ్యంతరాలు ఉంటే, ప్రెస్ కౌన్సిల్ కు పిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. వార్తలు ప్రచురణ ప్రసారాలకు మీడియా యాజమాన్యాలే బాధ్యత వహించాలే తప్పా జర్నలిస్టులను బాధ్యు లను చేస్తూ అరెస్టు



చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విచారించే అవకాశాలు ఉన్నప్పటికీ నేరస్థుల మాదిరిగా అరెస్టు చేయడాన్ని సిపిఎం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన జర్నలిస్టును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులను అరెస్ట్ చేయడం సరికాదు. . ఎన్టీవీ జర్నలిస్టులను విచారణ పేరుతో భయాందోళన గురిచేసి ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి అర్ధరాత్రి ఇండ్లలోకి వెళ్లి అరెస్ట్ చేయడం సరికాదని తెలంగాణ మలిదశ ఉద్యమ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరోజు వీరాచారి అన్నారు.

# యువత ప్రతిభ వెలికితీయడానికే సంసద్ క్రీడోత్సవాలు

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 'సంసద్ క్రీడా మహోత్సవం 2025--26 నిర్వహిస్తున్నట్లు భాజపా మండల అధ్యక్షులు గూదె మధుసుధన్ యాదవ్ తెలిపారు. శుక్రవారం నాడు మండలంలోని దత్తప్పగూడెం" లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ భారీ క్రీడా పోస్టర్ ను మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు.. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో, నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయికి చేర్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు .ఈ క్రీడా మహోత్సవంలో భాగంగా



క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 17వ తేదీ వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 18వ తేదీన జట్ల ఎంపిక కోసం డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ స్థాయి పోటీలు జనవరి 19 నుండి 28 వరకు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో జరుగుతాయని పేర్కొన్నారు.ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన జట్లకు. తుంగతుర్తి అసెంబ్లీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50,000, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 25,000 నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు.

అసెంబ్లీ స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన జట్లు తప్పనిసరిగా పార్లమెంట్ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.. పార్లమెంట్ స్థాయి పోటీలకు సంబంధించిన డ్రా జనవరి 31న నిర్వహించనుండగా,ఆ పోటీలు ఫిబ్రవరి 1 నుండి 5 వరకు భువనగిరిలో జరుగుతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న భువనగిరి వేదికగా విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల ఉపాధ్యక్షులు గుంటి సతీష్, , మండల నాయకులు మల్లేష్ యాదవ్, గణేష్ శివ నరేందర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు సందడి మొదలయ్యే...

**హీటెక్కుతున్న రాజకీయాలు.**

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగక ముందే రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరిలో పురపోరు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేయడంతో స్థానిక నాయకులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్ల ప్రకటనపై ఇప్పటికే ఒక ప్రాథమిక అంచనాకు వచ్చిన ఆశావహులు, తమ గెలుపు గుర్రాలెవరో తేల్చుకునే పనిలో పడ్డారు.మోత్కూరు మున్సిపాలిటీలోని మొత్తం 12 వార్డులకు సంబంధించి గత ఎన్నికల తరహాలోనే రిజర్వేషన్లు కొనసాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 2020 ఎన్నికల మాదిరిగానే బీసీ జనరల్ 2, ఎస్టీ 1, జనరల్ మహిళ 4, ఎస్సీ మహిళ 1, ఎస్సీ జనరల్ 1, బీసీ మహిళ 1, జనరల్ 2 స్థానాలు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రోస్టర్ విధానం ప్రకారం ఏ వార్డు ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ అభ్యర్థుల్లో కొనసాగుతోంది. రిజర్వేషన్ల ఖరారు కోసం కలెక్టర్ల స్థాయిలో తుది కసరత్తు జరుగుతుండటంతో, నోటిఫికేషన్ రాకముందే ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నారు.




ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగనుంది.

అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి మున్సిపల్ పీఠంపై తమ జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉండగా, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తన పట్టును నిలబెట్టుకోవాలని తహతహలాడుతోంది. ప్రతి వార్డులోనూ టిక్కెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో వార్డు నుంచి 4నుంచి 6మంది దాకా ఆశావహులు రేసులో ఉండటంతో, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు ప్రయత్నిస్తున్నారు. తాము ఎక్కడి నుంచి పోటీ చేయడానికైనా సిద్ధమని, ఈసారి తమకే అవకాశం ఇవ్వాలని ముఖ్య నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ కూడా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని భావిస్తోంది. అన్ని స్థానాల్లోనూ పోటీ చేసి తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళలో కాంగ్రెస్, బారాస, భాజపా పార్టీల సన్నాహక సమావేశాలతో పట్టణంలో ఎన్నికల సందడి నెలకొంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా గట్టి పోటీ ఇచ్చామని, ఈసారి అధికారంలో ఉన్నందున గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది.పార్టీల కోసం ఏళ్ల తరబడి నిస్వార్థంగా పనిచేస్తున్న కార్యకర్తలు కూడా ఈసారి తమకు గుర్తింపు దక్కుతుందని ఆశిస్తున్నారు. ఆర్థికంగా అంతగా బలం లేకున్నా, పార్టీ పట్ల విధేయతతో ఉన్న తమకు టిక్కెట్ కేటాయిం చాలని పలువురు ఆశావహులు కోరుతున్నారు. ఒకవేళ పార్టీ ప్రాధా న్యత ఇవ్వకపోతే, స్వతంత్ర అభ్యర్థులుగానైనా బరిలోకి దిగేందుకు కొందరు సిద్ధమవుతుండటం గమనార్హం. మోత్కూరు మున్సిపల్ రాజకీయం రానున్న రోజుల్లో మరెన్నో మలుపులు తిరుగుతుందో మరి కొద్దిరోజులుగా దాకా వేచి చూడాల్సిందే.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వ్యవహరించాలి: ఎస్.ఐ.సతీష్

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ కే. సతీష్ అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో మెడికల్, హెల్త్ డిపార్ట్ మెంట్, గ్రామపంచాయితీ పాలక మండలి సమన్వయంతో మండలం అనాజీపురం గ్రామంలో శుక్రవారం నాడు పోలీసులు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు..ఈ సందర్భంగా ఎస్.ఐ.సతీష్ మాట్లాడుతూ, రోడ్లపై నిర్లక్ష్యంగా వాహనాలు ఎంత ప్రమాదమో సవిరంగా వివరించారు. ప్రధానంగా మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు, వివిధ వాహనాలు ద్వారా డ్రైవింగ్ చేసే డ్రైవర్లు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతి వేగ నియంత్రణ పాటించడం, పాదచారుల భద్రతకు ప్రాధాన్యం సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు అనుసరించడం అత్యంత అవసరమన్నారు. .మెడికల్ , హెల్త్ అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ పాత్ర ఎంతో కీలకమని, ప్రమాదం జరిగిన తొలి గంటలో సరైన



వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసు వెంకటయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ త్రివేణి, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, ఏ.ఎస్.ఐ ఎం. వెంకన్న, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు. పాల్గొన్నారు.



# యువత క్రీడలలో రాణించాలి

**పనకబండ సర్పంచ్ రేణుక అనిల్ కుమార్**

**మోత్కూరు,జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** యువత క్రీడలలో రాణించాలని పనకబండ సర్పంచ్ లోతుకుంట రేణుక బి అనిల్ కుమార్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 14,15 తేదీలలో మండలంలోని పనకబండ గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ రేణుకబిబి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడత్సవాలు నిర్వహించారు. ఈ క్రీడోత్సవాలలో భాగంగా క్రికెట్ , వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్పంచ్ రేణుక బి అనిల్ లు గురువారం రాత్రి బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని మల్లేష్, బోటిక ధనుంజయ్, పైళ్ల మహాలక్ష్మి, ఒర్సు సుజాత , బట్టు మత్స్యగిరి, మాజీ సర్పంచులు బత్తిని తిరుమలేష్, సూధగాని పాండు, బి.ఆర్.ఎస్. మండల అధ్యక్షులు పొన్నెబో యిన రమేష్, సీనియర్ జర్నలిస్ట్ కారుపోతుల పాండరీ, స్థానికులు బత్తిని మహేష్, నల్ల పోగుల వెంకన్న, బత్తిని చరణ్, బత్తిని సతీష్, పొన్నెబోయిన మత్స్య గిరి, బత్తిని హరికృష్ణ, కారుపోతుల శేఖర్, ఒర్సు శ్రీను, పొన్నెబోయిన జనార్ధన్, వలమాల మహేందర్, బత్తిని కృష్ణ, తిరుమలేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగమ్మగూడెంలో ఘనంగా ముగ్గుల పోటీ

**రామన్నపేట, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ రంగమ్మ గూడెం విలేజ్ లో కాంగ్రెస్ పార్టీ పదో వార్డు సభ్యులు వంగల అవినాష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు.ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకి అవినాష్ కు



తోచిన ఆర్థిక సహాయంతో మహిళలకు బహుమతి ప్రధానం అందజేయడం జరిగింది.ఫస్ట్ ప్రైస్ మాంద్ర పూజ, సెకండ్ ప్రైస్ మద్దె గళ్ళ ఉమా ,థర్డ్ ప్రైస్ పల్సం సంతోష విజేతలుగా గెలుపొందారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ రంగమ్మ గూడెం మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని రాబోయే రోజులలో మహిళలు ఉన్నత స్థాయికి రావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంగార్డు శ్రీశైలం యాదవ్ రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముద్రబోయిన మల్లయ్య, వంగాల ఉపేందర్,ముద్రబోయిన ఆంజనేయులు, ముద్ర బోయిన లింగస్వామి, మద్దె గళ్ళ శీను ,మద్దె గల్ల ఉప్పలయ్య, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.




## వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
# క్రీడల ముగింపు కార్యక్రమం

**-ముఖ్యఅతిథిగా హాజరైన వలిగొండ తహాశీల్దార్ దశరథ**

**వలిగొండ జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి సంక్రాంతి క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. క్రికెట్లో 20 టీంలు పాల్గొనగా జై భీమ్ టీం విజేతగా, రన్నరప్ గా యువసేన టీం నిలిచింది. వాలీబాల్ లో 18 టీంలు పాల్గొనగా యువసేన టీం విజేతగా, రన్నరప్ గా సర్దార్-2 టీం గెలుపొందాయి. చెస్ ఆటలో 23 మంది పాల్గొనగా విజేతగా ఎడ్ల శ్రీనివాస్, రన్నరఫ్ గా దుడ్డు నవీన్ విజయం సాధించడం జరిగింది. గెలుపొందిన ప్రతి టీంకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వలిగొండ మండల తహాశీల్దార్ దశరథ, స్థానిక గ్రామ సర్పంచ్ అనిత నర్సింగ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, వార్డ్ మెంబర్ల చేతుల మీదుగా కప్ లు, షీల్డులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ దశరథ మాట్లాడుతూ ఊరంతా ఒకే యూత్ గా కలిసి క్రీడల్లో పాల్గొని ఒక పండగ వాతావరణాన్ని కల్పించిన క్రీడాకారులకు, అసోసియేషన్ సభ్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, గ్రామ యువత, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ నగర్ కాలనీలో
# ఘనంగా సంక్రాంతి సంబరాలు

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ కాలనీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సంప్రదాయ పద్ధతిలో





పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు కాలనీవాసుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వీడేం రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్ పాల్గొని పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే యూత్ అధ్యక్షుడు కోట పవన్‌తో పాటు మామిడి శెట్టి శ్రీనివాస్, ఉడుత సురేష్, గుత్తి మలేష్, గంజి ధనంజయ్, బాత్కు విజయ్, మొగిలి మహేష్ పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాలు

**చిన్నారులతో కలిసి గాలిపటాలు ఎగురవేసిన మాజీ కౌన్సిలర్ ఉషారాణి**

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానికంగా నిర్వహించిన 'కైట్ ఫెస్టివల్ల (గాలిపటాల పండుగ)లో మాజీ కౌన్సిలర్ ఉషారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులతో కలిసి ఉత్సాహంగా గాలిపటాలు





ఎగురవేసి సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. గాలిపటాలు ఎగురవేస్తూ చిన్నారులతో కాసేపు సరదాగా గడిపిన ఆమె, వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంక్రాంతి సంబరాల్లో పతంగుల సందడి

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పతంగులు ఎగురవేసే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా, పెద్దా అనే తేడా



లేకుండా అందరూ పతంగులు ఎగురవేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ సీతారం, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, శ్రీనాథ్ గౌడ్, మహేష్, ఉసేన్, శ్రీనివాస్, శివా, తిరుపతి, చంద్రశేఖర్, బాలకృష్ణ, ప్రశాంత్, అనిల్, ఆదర్శ్, శ్రీకర్, గంగాపురి, శంతన్న తదితరులు పాల్గొని సంక్రాంతి సంబరాలకు మరింత రంగు చేర్చారు.



## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న చర్యను
# గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలి


**రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి**

**రామన్నపేట, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. జనంపల్లి గ్రామంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాలపై భారాన్ని మోపుతూ కేంద్ర ప్రభుత్వ బాధ్యత నుండి తప్పుకునే ప్రయత్నం చేస్తూ పేరును సైతం మార్చే కుట్ర చేస్తుంది అన్నారు. గ్రామాల్లో పేదలు వ్యవసాయ కూలీలకు కాస్త ఉపాధి, ఆర్థిక వెసులుబాటు ఆత్మగౌరవం కలుగుతుందని ఉపాధి హామీ చట్టాన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి కుట్రను తిప్పి కొట్టాలని అన్నారు. మాజీ ఎంపిటిసి వేమవరపు సుధీర్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం గ్రామ శాఖ కార్యదర్శి పులి బిక్షమయ్య, నాయకులు పండుగ రాజమల్లు సంగిశెట్టి మార్కండేయ మాజీ సర్పంచి రాచమల్ల పర్వతాలు అక్కెనపల్లి వీరయ్య, వార్డు సభ్యులు పండుగ రజిత, అక్కెనపల్లి కలమ్మ, సంగిశెట్టి శివాజీ, అక్కెనపల్లి శివ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కందుల హనుమంతు, సిఐటియు మండల నాయకులు వంగాల మారయ్య, దేశపాక రవి,శ్రీకృష్ణ, పుట్టల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాంపల్లిలో 18న మెగా రక్తదాన శిబిరం

**తలసేమియా బాధితుల ప్రాణాలను కాపాడే సేవా కార్యక్రమం.**

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న రోగులకు అండగా నిలిచే ఉద్దేశంతో ఈ నెల 18వ తేదీన శివరాంపల్లిలో మెగా రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని అఖిల భార తీయ మార్వాడీ యువజన సంఘం, జిందగీ ఫౌండేషన్, హెల్పింగ్ హ్యూమన్స్ ఫౌండేషన్ మరియు కరామా ఫౌండేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తు న్నాయి. ఈ రక్తదాన శిబిరం తలసేమియా సికిల్ సెల్ సొసైటీ, రాఘవేంద్ర కాలనీ, శివరాంపల్లి (నేషనల్ పోలీస్ అకాడమీ సమీపంలో)లో ఉదయం 9:00 గంటల నుండి




సాయంత్రం 7:00 గంటల వరకు కొనసాగుతుంది అన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే ప్రతి రక్తదాతకు 'రక్తవీర్ణసన్మానంతో పాటు రక్తదాన ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా మోటివేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చని, ముఖ్యంగా తలసేమియా బాధితులకు రక్తదానం జీవనాధారమని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాల కోసం మేఘన్ కుమార్‌ను 991211 3475, 9030113475 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఈ నెల 18న రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి ముఖ్య సమావేశం: కన్వీనర్ వై. శ్రీధర్

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ, ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఉప్పరపల్లిలోని పిల్లర్ నెంబర్ 179 వద్ద ఉన్న జాయింట్ కన్వీనర్ బొక్క బాల్ రెడ్డి కార్యాలయంలో ముఖ్య సమావేశం నిర్వహించ నున్నట్లు సమితి కన్వీనర్ వై. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. జాగో భాగ్యనగర్ - చలో బాలాపూర్: ఈ నినాదంతో హిందూ సమాజాన్ని చైతన్యపరచడం. అక్రమ చొరబాటుదారుల బహిష్కరణ: దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశ్ మరియు రోహింగ్యా ముస్లింలను తక్షణమే అరెస్టు చేసి, వారి దేశాలకు తిరిగి పంపాలని ఈ సమావేశం ద్వారా డిమాండ్ చేయనున్నారు. ధర్మరక్షణ సభ: ఈ నెల 24వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 2 గంటలకు బాలాపూర్ వేదికగా జరగనున్న భారీ "ధర్మరక్షణ సభ"ను విజయవంతం చేయడంపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని



సమితి సభ్యులు, ధర్మ ప్రేమికులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో, సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా వై. శ్రీధర్ కోరారు. సమావేశానికి విచ్చేసిన వారికి అల్పాహార సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## బిజెపి నాయకులు తోకల శ్రీశైలం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలకు సంక్రాంతి శుభాకాంక్షల వెల్లువ

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులను కలిసి పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు తోకల శ్రీశైలం రెడ్డిని, అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ మరియు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పండుగ పూట నాయకులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి మకర సంక్రాంతి శుభా



కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..నియోజకవర్గ ప్రజలందరికీ, పార్టీ కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు.

# మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ

**ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేయాలి**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్లగొండ, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ల విషయమై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుకై జీవో ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేసే సమయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు నిబంధనల ప్రకారం, పారదర్శకంగా అమలు చేయాలన్నారు.గత ఎన్నికల రిజర్వేషన్ డేటా, జనాభా గణాంకాలు, రొటేషన్ విధానం వంటి అంశాలను



సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని వార్డుల వివరాలు, రిజర్వేషన్ పట్టికలను ముందుగానే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని, అవసరమైన చోట స్పష్టత కోసం వెంటనే సంప్రదించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సవ్యంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.






## తుది జాబితా విడుదల చేసిన మున్సిపల్ కమీషనర్

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు పురపాలక పరిధిలో ఉన్న 12. వార్డులకు 26 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ కె. సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుసరించి పుర పాలక సంఘ కార్యాలయంలో నోటిస్ బోర్డు పై 26 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రదర్శించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏప్రిల్ 19 తెలంగాణ మోడల్ పాఠశాలలో ప్రవేశపరీక్ష

**మోత్కూరు, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
తెలంగాణ మోడల్ స్కూల్ లో 2026 బి27 సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం పొందుటకు ఈనెల 17 న నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని ఎంఈఓ సత్యనారాయణ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రవేశం పొందుటకు ఈ 28 నుంచి ఫిబ్రవరి 28వరకు ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ఏప్రిల్ 9న హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చునచ్చునని అన్నారు. 19బి04 బి 2026 ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన మోడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఫీజు , జనరల్ విద్యార్థులకు 200 రూపాయలు బీసీ, ఎస్సీ ,ఎస్టీ, విద్యార్థులకు 125 ఫీజు ఉంటుందని. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాజమాత ఎడ్యుకేషన్ సెంటర్
# విద్యార్థులకు ఆహారం అందజేత

**మోత్కూరు,జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** సంక్రాంతి పర్వదినాన్ని. పురస్కరించుకొని మండలంలోని పాటిమట్ట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ రాజమాత ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులకు రాజమాతా ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం నాడు



అన్నం వడ్డించి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజామాత ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ రెడ్డి , సభ్యులు రచ్చ సర్వారెడ్డి, రచ్చ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేత

**గట్టుప్పల, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** గట్టుప్పల మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన మెదటి బహుమతి గట్టుప్పల స్పోర్ట్స్ అకాడమీ విజేత 30.000 రెండోవ బహుమతి చమలపలి విజేత 20.000 రూపాయలను సర్పంచ్ నామని జగన్నాథం ఏఎస్సై ఆంజయ్య నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దోర్నాల భరద్వాజ్ బహుమతులు అందజేశారు .సర్పంచ్ నామని జగన్నాథం ఏ.ఎస్సై ఆంజయ్య నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దోర్నాల భరద్వాజ్ మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు.చెడు వ్యసనాలకు వెళ్లకుండా యువత లక్ష్యం తో ముందుకు వెళ్లాలని




కోరారు. గెలుపొందిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఈ కార్యక్రమంలో , చమలపల్లి గ్రామ సర్పంచ్ మదిగొండ ఆంజనేయులు, ఉప సర్పంచ్ కమ్మం లక్ష్మయ్య, పగిల్ల శంకర్,బిమాగాని మల్లేశం, పెదగని నరేందర్, లడే యదయ్య, చంద్రయ్య రాంబాబు , మెదుగు బల్రెడ్డి,గంట రమేష్,శ్రీషేలం, చిలువేరు వేణు ప్రశాంత్, మొద్దు నవీన్,వోడ్డేపల్లి సైదులు స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.








## యువత మంచి లక్ష్యంతో ముందుకెళ్లాలి

### - మాజీ ఉప సర్పంచ్ కాసాల జనార్ధన్ రెడ్డి

**గట్టుప్పల, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా గుండ్రపల్లి మాజీ ఉపసర్పంచ్ కాసాల జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో గుండ్రపల్లి ఎంపీటీసీ పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. శుక్రవారం మీడియాతో జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో భాగంగా యువత మంచి మార్గంలో నడుచుకోవాలని, యువత క్రీడల్లో రాణించటానికి తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఇట్టి వాలీబాల్ టోర్నమెంట్ లో పలు జట్లు తలపడగా మొదటి బహుమతి గెలుపొందిన కురుపాటి రాజకుమార్ టీంకు జనార్దన్ రెడ్డి పదివేల రూపాయలు అందజేశారు. రెండవ బహుమతి గెలుపొందిన దామెర అనిల్ టీంకు పెండ్యాల గీత ఐదు వేల రూపాయలు అందజేశారు. ఇట్టి ప్రోగ్రాంలో పాల్గొన్న గ్రామ యువతకు ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఐద్వా జాతీయ 14వ మహాసభలను జయప్రదం చేయండి

### పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పిలుపు

**నల్లగొండ,జనవరి 16 (వార్తా వేదిక సూర్య):** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ 14 వ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు హైదరాబాద్ పట్టణంలో జరగనున్న నేపథ్యంలో, నల్లగొండ లోని దొడ్డి కొమరయ్య భవనంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ..”25 వ



తేదీన హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు మహిళలు వేలాదిగా తరలి రావాలి. ప్రతి గ్రామం నుంచి ఊరుకో బండి రావాలి” అని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారి ఐద్వా జాతీయ మహాసభలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ,”దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రతినిధులు హాజరై మహిళల సమస్యలపై సమగ్ర చర్చలు జరిపి భవిష్యత్తులో మహిళల సంక్షేమం, అభివృద్ధి,రక్షణ కోసం తీర్మానాలు, పోరాటాల కార్యక్రమాలు నిర్ణయించబడతాయి. ఇందుకు హైదరాబాద్ వేదిక కానుంది” అని తెలిపారు.
మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, “నిత్యం జరుగుతున్న ఈ అన్యాయాల పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులకు త్వరితగతిన శిక్షలు విధించడానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి” అని డిమాండ్ చేశారు.
అలాగే మహిళల అభ్యున్నతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, నిమ్మల పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, ఎండి సుల్తానా, సిహెచ్ నాగమణి,సహాయ కార్యదర్శి పాదూరు గోవర్ధన, జిల్లా కమిటీ సభ్యురాలు గోలి వెంకటమ్మ, కౌసల్య, టీ నాగమణి, సైదమ్మ, ఉమారాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## లింకులను క్లిక్ చేస్తే బుక్ అయినట్లే

### - గుండాల మండల ఎస్సై ఎం.తేజం రెడ్డి హెచ్చరిక..


**గుండాల, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
గుండాల మండల పరిధిలో సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల మండల ఎస్సై ఎం. తేజం రెడ్డి విశ్వజ్యోతి విలేకర్ శ్రీనివాస్ గౌడ్ తో సూచించారు. ఇటీవల వాట్సాప్ గ్రూపులు,




వ్యక్తిగత చాట్స్‌లో “నాకు రూ.5 వేలు వచ్చాయి. మొదట నకిలీ అనుకున్నాను. మీరూ ప్రయత్నించి చూడండి. ఈ లింకును పది మందికి ఫార్వర్డ్ చేయండి” అంటూ వస్తున్న సందేశాలు పూర్తిగా మోసపూరితమైనవని ఆయన స్పష్టం చేశారు.ఇలాంటి లింకులను క్లిక్ చేసిన వెంటనే మొబైల్ ఫోన్ హ్యాక్ అయ్యే అవకాశం ఉండటంతో పాటు, బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందన్నారు.

ఈ విధమైన మోసాల ద్వారా బాధితుల ఖాతాల నుంచి డబ్బు అక్రమంగా విత్‌డ్రా చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులు, ఆఫర్లు, బహుమతి సందేశాలపై నమ్మకం పెట్టుకోవద్దన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, నగదు బహుమతుల పేరుతో వచ్చే లింకులను పూర్తిగా దూరంగా ఉంచాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై తేజం రెడ్డి కోరారు. ప్రజల జాగ్రత్తే సైబర్ నేరాలకు ప్రధాన అడ్డుకట్ట అని ఆయన అన్నారు.



# విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

### అంతర్ రాష్ట్ర నిందితుడి అరెస్టు చేసిన చింతపల్లి పోలీసులు : అడిషనల్ ఎస్.పి జి.రమేష్

**నల్లగొండ,జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
విదేశాల్లో ఉన్నత చదువులు చదివిస్తానని, అక్కడే ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసి, మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర నిందితుడిని, చింతపల్లి పోలీసులు అరెస్టు చేసారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ లోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ జి. రమేష్ వెల్లడించారు. జిల్లాలో నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని “విదేశాల్లో ఉన్నత చదువులు, మంచి ఉద్యోగాలు” అనే ఆశ చూపి మోసం చేసిన ఘటన చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, నల్లగొండ జిల్లా పోలేపల్లి రాంనగర్‌కు చెందిన కోయల కార్ కరుణభాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె కుమారుడిని విదేశాలకు పంపించి, ఉన్నత చదువులు చదివించి, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, డబ్బులు తీసుకొని మోసం చేశారనే ఆరోపణలపై చింతపల్లి పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు. ఈ కేసును లోతుగా విచారిస్తుండగా, ముప్పాళ్ల లీలా కృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఇతడు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో పలువురు విద్యార్థుల నుండి భారీ మొత్తంలో డబ్బులు తీసుకొని ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు తేలింది.

పట్టుబడిన నిందితుడు గతంలో విదేశాల్లో ఉద్యోగం చేసి అక్కడి పరిచయాలను ఉపయోగించుకొని, భారతదేశానికి వచ్చిన అనంతరం చెడు వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ మోసాలకు పాల్పడ్డాడని విచారణలో వెల్లడైంది. విదేశాలకు వెళ్లాలని ఆసక్తి చూపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నమ్మించి ఇప్పటివరకు మొత్తం 8 మంది నుండి సుమారు రూ.85 లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు గుర్తించారు.ఈ విదంగా సంపాదించిన డబ్బులతో నిందితుడు కొంత డబ్బును విలాసాలకు , జల్సాలకు ఖర్చు పెట్టాడు.

శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో మాల్ గ్రామం, మర్రిగూడ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని గుర్తించిన చింతపల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో అతని వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై ఇప్పటికే మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ మరియు వరంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీటింగ్ కేసులు నమోదై ఉన్నట్లు నిర్ధారణ అయింది.

ఈ కేసులో నేరస్థుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబర్చిన నాంపల్లి సీఐ డి.రాజు, చింతపల్లి ఎస్ఐ ఎం.రామ్మూర్తి, చింతపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు .ఈసందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ.. యువతను లక్ష్యంగా చేసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగాల్లో నియామకాలు చేయిస్తామని మోసగాళ్లు నమ్మిస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల పేరుతో ముందస్తుగా డబ్బులు అడగడం, నకిలీ నియామక పత్రాలు చూపించడం, వాట్సాప్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా తప్పుడు హామీలు ఇవ్వడం వంటి పద్ధతులతో అమాయకులను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.

ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం అధికారిక నోటిఫికేషన్లు, గుర్తింపు పొందిన సంస్థలు, ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారానే పొందాలని సూచించారు. ఉద్యోగం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తూ, జిల్లా ప్రజలు ముఖ్యంగా యువత జాగ్రత్తగా ఉండి మోసాలకు గురికాకుండా పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్

**గట్టుప్పల, జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రాంతీయ అభివృద్దే లక్ష్యం గా ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది నెలలుగా, ఏప్రిల్ 14, 2025 అంబేద్కర్ జయంతి నుంచి జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ తరపున నిరంతర సామాజిక సేవలు అందిస్తున్నని తెలిపారు. కేవలం సేవా కార్యక్రమాలతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు చేరువగా ఉండి సమస్యలు పరిష్కరించేందుకు చౌటుప్పల్‌లో త్వరలో ఇఎల వి భాస్కర్ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.ఇటీవల నాంపల్లి మండలం దామెర గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడ గత పదేళ్లుగా దామెర గ్రామానికి బస్సు



సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా, ఇంకా ఫ్లోరోసిస్ భూతం జిల్లాను వదలడం లేదన్నారు.నేటికీ ఫ్లోరోసిస్ నీటితోనే పంటలు పండుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.ఎంతోమంది అర్హులైన వృద్ధులకు కనీసం పెన్షన్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం అండగా ఉంటానని తెలిపారు. మీ ఊరిలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడతానని, ఒకవేళ ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజల తరపున పోరాటం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల కోసం నేను ఎక్కడి దాకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నా శక్తి మేరకు సమస్యలను పరిష్కరిస్తా లేని పక్షంలో ప్రభుత్వం నుండి సాధించుకునే వరకు పోరాడుదామని తెలిపారు.మన బతుకులు బాగుంటేనే, మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. రాజకీయ పదవి ఉన్నా లేకున్నా,ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటానని ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన నాయకులు ఐదేళ్ల పాటు వారి సొంత ప్రయోజనాల కోసం, వారి అభివృద్ధి కోసమే చూసుకుంటున్నారు తప్ప, ఓట్లేసిన ప్రజల కోసం ఏమీ చేయడం లేదని ఆరోపించారు.





## లేబర్ కోడ్స్, వి బి జి రామ్ జీ, విద్యుత్ సవరణ చట్టాన్ని

# రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

### 19న నల్లగొండ నిరసన ర్యాలీ, సభను జయప్రదం చేయండి

**నల్లగొండ,జనవరి 16 (వార్తా వేదిక సూర్య):**
లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గ హక్కుల్ని కాలరాస్తూ,ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం పేరుతో రైతులను, ప్రజలను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం పై సమరశీల పోరాటాల్లో భాగంగా 19 న జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ర్యాలీ సభను జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 19 న జరుగు నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పట్టణంలో నిర్వహిస్తున్న జీపు జాత ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ప్రచార క్యాంపెయిన్ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు చేస్తామని అన్నారు. మోడీ విధానాలు మార్చుకోకపోతే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులు మరింత దోపిడీ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రామ్ జీ గా మార్చి పేదల పొట్ట కొట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సవరణ చట్టం 2025 ప్రకారం భవిష్యత్తులో విద్యుత్ రంగం ప్రైవేటుపరమై సబ్సిడీలు పోతాయని ప్రజలపై రైతులపై మరింత భారం పెరగనుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పనంగా అప్పజెప్తోందని అన్నారు. ఈ విధానాలపై కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల వ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త ప్రచార కంపియన్ జయప్రదం చేయాలని కోరుతూ గ్రామస్థాయి వరకు ప్రచార జాతలు జనవరి 19న సభతో ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేస్తామని అన్నారు. ఈనెల 19న నల్గొండలో జరిగే సభకు అధిక సంఖ్యల కార్మికుల కర్షకులు పాల్గొని విజయవంతం

చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ , రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి మధుసూదన్ రెడ్డి తాపీ కార్మిక సంఘం ఎండి సర్దార్ అలీ అధ్యక్షుడు సాగర్ల మల్లయ్య సంఘాల నాయకులు గంజి రాజేష్ సిహెచ్ అనురాధ, సీత వెంకటయ్య బీములపల్లి శంకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కొడుకుని పరామర్శించిన మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

### దండు మల్కాపూర్ సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్.

**చిన్నకొండూర్, జనవరి 16(వార్తా వేదిక సూర్య):** ఇటీవల అనారోగ్యానికి గురై కొత్తపేటలోని అంకురా హాస్పి టల్‌లో ఉన్నటువంటి చిన్నకొండూర్ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు దొర్నాల నరేష్ కుమారుడు దోర్నాల సాత్విక్ తేజ ని పరామర్శించి హాస్పిటల్ యాజమాన్యం తో మాట్లాడి సకాలంలో వైద్యం మంచిగా అందేలా చూడాలని చెప్పి అలాగే వారికి పార్టీ పరంగా గా అన్ని విధాలా అండగా ఉంటాను అని మనోధైర్యంన్ని ఇచ్చి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాను

మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి. బి ఆర్ ఎస్ పార్టీ చౌటుప్పల్ మండల అధ్యక్షులు,మల్కాపూర్ సర్పంచ్ గిర్కటి, చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్న దోర్నాల నరేష్ కి పార్టీ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుంది అని అన్నారు.

